విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 11, ఆగస్టు 2023

అనుమతులు లేకున్నా ఎర్ర మట్టి తవ్వకాలు

విశాలాంధ్ర - ప్యాపిలి : ప్యాపిలితోపాటు ఖనిజ సంపద ఎక్కువగా ఉన్నటువంటి రాచర్ల గుడిపాడు ఏనుగుమర్రి హుసేనాపురం మెట్టుపల్లి పిఆర్ పల్లి వెంగళంపల్లి తదితర గ్రామాలలో ఉన్నటువంటి ఖనిజ సంపదను అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమంగా తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారని అంతేకాకుండా అధికార యంత్రాంగం వైసీపీ నాయకులకు అండగా ఉంటున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే రాధాకృష్ణ ,ప్యాపిలి మండల కార్యదర్శి పి వెంకటేశు ఒక పత్రిక ప్రకటనలో వారు విమర్శించారు. అభివృద్ధి పనుల పేరుట మంత్రి ఇలాఖాలో కాంట్రాక్టర్లు మట్టిని తోలుకోవడానికి అనుమతులు ఉన్నాయని మండలంలోని ప్రజలను మభ్యపెడుతూ పట్టపగలే ఎర్రమట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, వైసిపి నాయకులు, కాంట్రాక్టర్లు,కొండలు సైతం యంత్రాల సహాయంతో బహిరంగంగా ట్రాక్టర్లు పెట్టి మట్టిని తరలిస్తున్న అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో మునిగి పోయారని అంతే కాకుండా కాంట్రాక్టర్ల పైన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని వారు విమర్శించారు. ఎర్ర మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్న గ్రామాల్లో సీపీఐ ప్రతినిధి బృందం పర్యటించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకునే విధంగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వ అధికారులను హెచ్చరించారు.

రేషన్ పంపిణీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - చాగలమర్రి : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే పంపిణీ చేయడానికి ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసిందని సిఎస్‌డిటి సోమశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పలు కాలనీలలో రేషన్ సరుకులు పంపిణీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంపిణీ ఏ విధంగా ఉందని కార్డుదారులను ప్రశ్నించారు. రేషన్ పంపిణీ చేసే వాహనాలు తప్పనిసరిగా కార్డు దారుల ఇంటి వద్దకే వెళ్లి సరకులు అందించాలని తెలిపారు. అనంతరం వాహనదారులు కార్డుదారులకు ముందస్తు సమాచారం అందిస్తున్నారా? లేదా? అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో 40వ జాతీయ రహదారిపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ సీఐ నాగరాజుయాదవ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి అక్రమంగా తరలుతున్న దాదాపు 300 బస్తాల రేషన్ బియ్యంతో ఉన్న లారీని గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నంద్యాల జిల్లా వెలుగోడు నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేటకు ఏపీ 27 ఎక్స్ 1702 నంబరు గల లారీలో దాదాపు 300 బస్తాలను తరలిస్తుండగా సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ నాగారాజు యాదవ్,సిబ్బంది మండలంలోని మద్దూరు మెట్ట సమీపంలో దాడులు నిర్వహించి లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవరు సికింద్రతో పాటు దళారి వెంకటేశ్వర రెడ్డి ని అదుపులోకి తీసుకుని, లారీని స్థానిక పోలీసు స్టేషన్కు తరలించారు. అక్రమ రవాణాకు కారణమైన నిందితుడు ఖలీల్ కోసం గాలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిటి సోమశేఖర్ రెడ్డి,విజిలెన్స్ సిబ్బంది సిద్దయ్య,జమాల్,ప్రవీణ్,సుబ్బరాయుడు పాల్గొన్నారు.

కెనాల్ ఆయకట్టు కింద రైతులకు సాగునీరు ఇవ్వాలి

విశాలాంధ్ర - నంద్యాల : కేసి కెనాల్ ఆయకట్టు కింద రైతులకు సాగునీరు ఇవ్వాలని టీడీపీ యువనేత భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెనాల్ ఆయకట్టు కింద రైతులతో కలసి టిడిపి యువనేత భూమా జగత్ విఖ్యత్ రెడ్డి పర్యటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, తెదేపా నేత తాతిరెడ్డి తులసిరెడ్డి, తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్, గోస్పాడు మండల నాయకుడు శీలం భాస్కర్ రెడ్డి, గోస్పాడు మండల తెదేపా కన్వీనర్ ఏరాసు చంద్రశేఖర్ రెడ్డి, యాలూరు శివారెడ్డి గంగుల వెంకటరెడ్డి బి.వి నగర్ సుబ్బయ్య శ్రీనివాసపురం గోపాలకృష్ణ శివాజీ శ్రీరామ్ నగర్ పేరయ్య చౌదరి పసురపాడు భాస్కర్ జూలేపల్లి సుదర్శన్ రెడ్డి గోస్పాడు విశ్వనాథరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి బారెడ్డి ప్రసాద్ రెడ్డి మాజీ ఎంపీటీసీ హుస్సేని చింతకుంట్ల రాంరెడ్డి నెహ్రూ నగర్ కొండారెడ్డి మునగాల శివారెడ్డి మాజీ కౌన్సిలర్లు చింతల సుబ్బరాయుడు, వాకా శివశంకర్, మన్నే కృపాకర్, షేక్ అజ్మీర్ భాష, తెదేపా నాయకులు చాంద్ బాషా అల్తాఫ్ భగవాన్ కాసిం శరత్ గోస్పాడు మండల నాయకులు పాల్గొన్నారు. కెనాల్ ఆయకట్టు కింద రైతులతో కలిసి పర్యటించిన అనంతరం జలవనరుల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను కలిసి రైతు సమస్యలను వివరించారు. జగత్ విఖ్యత్ రెడ్డి మాట్లాడుతూ కేసి కెనాల్ కింద రైతులకు సాగునీళ్ళు అందించాలని డిమాండ్ చేశారు.

రైతులు వేసిన పంటలు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర- మిడుతూరు : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులు వేసిన పంటలను ఈ పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం పీరు నాయక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో పంట నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల వ్యవసాయ మరియు రెవెన్యూ సిబ్బంది కి ఈ -పంట పై తగు సలహాలు ,సూచనలు ఇచ్చారు,అలాగే ఈ -పంట వల్ల రైతులకి రైతు భరోసా ,ఇన్పుట్ సబ్సిడీ, ఉచిత పంటల భీమ ,సున్నావడ్డి పంట రుణాలు వంటి సంక్షేమ ఫలాలు రైతులకి అందుతాయి కావున గ్రామస్థాయి సిబ్బంది తప్పని సరిగా ప్రతి రైతు వారు వేసిన పంటలను దగ్గర ఉండి రైతుల సమక్షంలోనే పంట నమోదు చేయవలసిందిగా వారికి వివరించారు.

తోపుడుబండ్ల పై మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర-డోన్ : పట్టణంలో తోపుడు బండ్లు పెట్టుకొని జీవనం సాగి స్తున్న వారిపై మున్సిపల్ అధికారుల వేధింపులు ఆపాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సుంక య్య అన్నారు. పట్టణం లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఉన్న తోపుడు బండ్లను మున్సిపల్ అధికారులు రోడ్డుకు అడ్డంగా ఉన్నాయని తీసుకెళ్లడం సరికాదని నిరసిస్తూ.. గురువారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. సుంకయ్య, డోన్ నియోజకవర్గ అధ్యక్ష,కార్యదర్శు లు పుల్లయ్య, అబ్బాస్ మాట్లాడుతూ పండ్లు, పూలు విక్రయిస్తూ ఎంతోమంది కుటుంబాన్ని పోషించుకుం టున్నారన్నారు. రహదారికి ఎలాంటి అడ్డం లేకపోయినా మున్సిపల్ కమిషనర్ తోపుదు బండ్లను కక్ష్య సాధింపు చర్య చేపడుతున్నారని విమర్శించారు.ఒక వైపు సీఎం జగన్మోహన్‌రెడ్డి తోపుడు బండ్ల వ్యాపారులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని చెపుతూ ఉంటే డోన్ లో మాత్రం మున్సిపల్ అధికారులు భిన్నంగా వ్యవహరి స్తున్నారు. తోపుల బండ్లను తీసుకెళ్లిన మున్సిపల్ అధికారులు తక్షణమే తెచ్చి ఎవరు బండ్లను అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తోపుడు బండ్ల యూనియన్ను అందరు ఏకమై ధర్నా నిర్వహిస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో తోపుడు బండ్ల సంఘం నాయకులు మౌలాలి, శీను, తాయేష్, రవి, రాజు, వెంకటేష్, లక్ష్మయ్య, సురేష్ పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు నీళ్లు విడుదల చేయాలి

విశాలాంధ్ర - పగిద్యాల : ముచ్చుమర్రి ఎత్తిపోతల కేసీసీ లిఫ్ట్ ద్వారా కృష్ణా మిగులు జలాలను కేసి కాలువలోకి నీళు వెంటనే విడుదల చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని ప్రాతకోట గ్రామంలో రైతులతో కలిసి కేసీ కెనాల్ కాలువలో దిగి ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్ ప్రారంభమై రెండు నెలల గడిచిన కేసీ కాల్వ కింద ప్రాతకోట, గణపురం, బీరవోలు, సంకిరేణిపల్లెభాస్కాపురం,తాటిపాడు, ముచ్చుమర్రి, పగిద్యాల తదితర గ్రామాల్లో దాదాపు వేల ఎకరాల్లో సాగు చేసిన వంటలు ఎండిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు పాలకులు స్పందించి ముచ్చుమరి ఎత్తిపోతల ద్వారా కేసు కెనాల్ రైతాంగానికి నీళ్ల వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. గ్రామ రైతులు పెద్ద మల్లయ్య, శివరాముడు, శేషన్న, బికారి,రాముడు,బాబు,మా భాష కాశి పాల్గొన్నారు.

ఓటర్ల ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి కావాలి

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024లో భాగంగా ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి కావాలని అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం అమరావతి విజయవాడ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎక్స్ అఫిషియో కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, డిఆర్ఓ పుల్లయ్య, ఈఆర్ఓలు, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం చేపట్టిన ఇంటింటి సర్వే పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఫారం 6 కొత్త ఓటర్లకు, 18 సంవత్సరాల నిండిన వారికి ఇవ్వాలని, ఫారం 8 చిరునామా మార్పులు కొరకు ఇవ్వాలన్నారు. ఓటర్లు తొలగింపు సంబంధించి ప్రొసీజర్ ప్రకారం జాగ్రత్తగా చేయాలన్నారు. అలాగే పలు అంశాలపై అందుకు సంబంధించిన కార్యాచరణపై జిల్లాలలోని అన్ని నియోజకవర్గాల ఈఆర్ ఓలు, ఏఈఆర్ ఓలకు దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తుల అరెస్ట్

విశాలాంధ్ర - నంద్యాల : ప్రభుత్వరంగంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 35 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన ఉమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రకాశం జిల్లాకు చెందిన నటరాజ, బెంగళూరుకు చెందిన సూర్యదేవర అనిల్ కుమార్, నెల్లూరు జిల్లాకు చెందిన పాలెం అశోక్ కుమార్ రెడ్డిలను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగ యువత లక్ష్యంగా భారీ మోసానికి తెరలేపిన ముద్దాయిలు ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులను నిలువునా మంచేందుకు కొంతమంది ఏజెంట్లను నియమించుకొని జాయినింగ్ లెటర్లు, శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఆదాయపు పన్ను శాఖలో టాక్స్ అసిస్టెంట్, టాక్స్ ఇన్స్పెక్టర్ సచివాలయం, రైల్వే శాఖ, అగ్రికల్చర్ అసిస్టెంట్ మొదలగు ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం చేశారన్నారు. బాధితుల నుండి 49,24,000/- రూపాయలు తీసుకొని వారికి నకిలీ అపాయింట్ మెంట్ లెటర్ లు సృష్టించి ఇచ్చి మోసం చేశారని ఎస్పీ తెలిపారు. ఈ కేసు విచారణలో ఆత్మకూర్ డిఎస్పి శ్రీనివాస రావు పర్యవేక్షణ లో నందికొట్కూర్ టౌన్ సిఐ విజయ భాస్కర్, వారి సిబ్బంది ఎస్ఐ వెంకట రమణ సహాయంతో కర్నూలు కొత్త బస్ స్టాండ్ వద్ద ముద్దాయిలకు అరెస్టు చేసి వారి వద్ద నుండి 35 లక్షల రూపాయల ను స్వాధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా నా భూమి, నా దేశం

విశాలాంధ్ర- నందికొట్కూరు : మండల పరిధిలోని బొల్లవరం, దామగట్ల గ్రామాలలోగురువారం ఎంపీడీవో శోభ రాణి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో నా భూమి, నా దేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నా భూమి,నాదేశం శిలాఫలకాన్ని ఏర్పాటుచేసి దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఎంపీడీవో, ఏపీఓ అలివేలు మంగమ్మ తమ సిబ్బంది తోవిద్యార్థిని విద్యార్థులతో మొక్కలు నాటించి వాటి అవకశత గురించి విద్యార్థులకు వివరించి తెలియజేయడం జరిగింది. ఉపాధి హామీ ఈసీ షబానా, గ్రామ సర్పంచులు, మాధవరం సుశీలమ్మ, రాఘవరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ కవిత, ఆయా స్కూల్లో హెచ్ఎంలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మా పొలాలకు దారి చూపండి

విశాలాంధ్ర - అవుకు : అవుకు మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని పొలాలకు వెళ్లే దారికి అడ్డుగా ఉన్న గేటును తొలగించాలి అని రైతులు గురువారం ఆందోళనకు దిగారు. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు చెర్లోపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 624/1 లో ఒక ఎకరా 40సెంట్లు భూమిని స్థానిక రైతు ఉప్పరి నల్లరాజ,ముచ్చలపురి నాగమద్దిలేటితో ఆరు సంవత్సరాల క్రితం కొనుగోలు చేశాడు. అయితే కొనుగోలు చేసిన పొలంలో గల దారి నుండి గత 40సంవత్సరాలుగా దాదాపు 40 మంది రైతులు తమ పొలాలకు సంబంధించిన వ్యవసాయ పనులకు గాను రాకపోకలు సాగిస్తున్నారు. అయితే నల్ల రాజా పొలం కొన్న దగ్గర నుండి రైతుల కష్టాలు ప్రారంభమయ్యాయని రైతులు వాపోయారు. దారికి అడ్డుగా పలుమార్లు ముళ్ళకంపలు అడ్డుగా ఉంచడంతో వాటిని తొలగించి రైతులు రాకపోకలు సాగించేవారు. అంతటితో ఆగని నల్లరాజ దారి ప్రారంభంలోనే అడ్డుగా ఇనుప గేటును బిగించి తాళం వేశాడని బాధ్యత రైతులు గత నెల 17న స్పందన రూపంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులలో ఎలాంటి చలనం లేకపోవడంతో బాధిత రైతులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారి పెద్దయ్య సర్వేయర్ తో కలిసి దారికి అడ్డుగా వేసిన గేటును, దారిని పరిశీలించి వెళ్లారే తప్ప పరిష్కారం చూపలేదని రైతులు అసహనం వ్యక్తం చేశారు. అయితే నల్లరాజకు భూమిని విక్రయించిన ముచ్చలపురి నాగమద్దిలేటి గత 40 సంవత్సరాల నుండి దారి ఉంది అని ఈ దారి గుండా రైతులు రాకపోకలు సాగించేవారు అని రైతుల పక్షాన నిలబడడం గమనార్హం. ఈఆందోళనలోమద్దిరాలశివయ్య,కాశమ్మ, నాగన్న, నాగమద్దయ్య, షేక్షావలి, సుధాకర్, కృష్ణుడు, కర్ణయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

కోతలేని విద్యుత్తును అందించాలి

విశాలాంధ్ర - పాములపాడు : మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాను విద్యుత్ సబ్ స్టేషన్ నుండి గత మూడు,నాలుగు రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలతో ప్రజల ను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారుల వైఖరికి నిరసనగా బిఎస్పి పార్టీ నందికొట్కూరు నియోజవర్గ ఇన్చార్జి ఎల్ .స్వాములు, సేవా భారతి అధ్యక్షుడు ఎస్. షర్ఫుద్దీన్ అలీ మరియు ప్రజలతో మండల కేంద్రమైన భోన్లపాడులోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగాధర్నా కార్యక్ర మాన్ని నిర్వహించారు. స్వాములు మాట్లాడుతూ గత మూడు, నాలుగు రోజులుగా మండల, గ్రామీణ ప్రాంతాలలో పగలు రెండు గంటలు, మరియు రాత్రి వేళలలో మూడున్నర గంటలు, విద్యుత్ కోతలు పెట్టడంతో చిన్న పిల్లలు మొదలుకొని వయోవృద్ధుల వరకు ఉడకపోతతో, దోమల బాధతో చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కనుక ప్రభుత్వము విద్యుత్ అధికారులు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేదంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. హమాలి యూనియన్ నాయకుడు పున్నంరాజు, మైమాకర్, బి.ఆనంద్ వెంకటేశ్వర్లు, రవి ఇమ్మానియేల్ చెన్నయ్య దానియేలు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

88వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి



విశాలాంధ్ర-డోన్ : ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. గురువారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్ 88 వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని డోన్ పట్టణంలోని నక్కి రామన్న భవన్ నందు డోన్ మండల సమితి ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్య ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగరత్నం వారు నాడు భారత దేశం బ్రిటీష్ పరాయి పాలకుల కబంధ హస్తాల్లో మగ్గుతున్న రోజుల్లో స్వాతంత్ర్యమే నా జన్మ హక్కు అని 1947 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నో నగరంలో అవిర్భవిం చిందన్నారు. భారతీయులకు స్వేచ్ఛ, వాయువులను అందించాలని దేశంలో ఉన్న విద్యార్థులను ఏకతాటిపైకి తీసుకొచ్చి,బ్రిటీష్ పాలకులపై ఉద్యమాలను నడిపించిందని అన్నారు.విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి, విద్యార్థుల ప్రాణ త్యాగం చేసిన ఘనత ఏఐఎస్ఎఫ్ దని అన్నారు. 87సంవత్సరాల దిగ్విజయంగా పూర్తి చేసుకొని,88 వ సంవత్సరంలోకి అడుగుతున్న సందర్భంగా విద్యార్థులు ఆస్ఫూర్తితో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపుని చ్చారు. మండల నాయకులు సిద్ధార్థ, మనోజ్, శశి, వినయ్ వినీత్ రాజేష్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలుకై రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రాష్ట్రంలో ఉన్న అంగన్వాడీ వర్కర్స్ కి కనీస వేతనాలు అమలు చేయాలని ఎన్నికల సమయంలో జగన్మోహన్ రెడ్డి తెలంగాణ కన్నా వెయ్యి రూపాయల అదనంగా వేతనం ఇస్తానని హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఆగస్టు 27వ తేదీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో అంగన్వాడి సంఘాల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని ఆ సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలకృష్ణ లు పిలుపునిచ్చారు.. శుక్రవారం స్థానిక ఆళ్లగడ్డ మండలంలో నియోజకవర్గం సమావేశం జరిగింది..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వైసీపీ ప్రభుత్వం వచ్చాక కార్మికులపై పని భారం విపరీతంగా పెరిగిందన్నారు. అదనపు శ్రమ, మానసిక ఒత్తిడి, రాజకీయ వేధింపులు, ఇతరుల పెత్తనం చెలరేగిపోయిందని అంగన్వాడీలను చులకనగా చూస్తున్నారని వారు అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, వీరిని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు . అలాగే సెలవులు, గ్రాడ్యుటీ,పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, 62 ఏళ్ల వయసు అమలు చేయాలన్నారు. మినీ వ్యవస్థను రద్దుచేసి నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని ఐసిడిఎస్ను ప్రభుత్వమే బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఇంకా అనేక సమస్యలతో కార్మికుల సతమతమవుతున్నారని ఈ సమస్యల పరిష్కార సాధనే ధ్యేయంగా ఐక్య పోరాటాలతో ముందుకెళ్లాలని కోరుతూ నిర్వహించే ఈ సదస్సును జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఆళ్లగడ్డ ఏఐటియుసి కార్యదర్శి భాస్కరు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నియోజకవర్గ నాయకులు చంద్రకళ, వసుంధర దేవి, తిరుపాలమ్మ,పద్మ, సీత మహాలక్ష్మి తదితరులు పాల్గొ న్నారు.

ఆళ్లగడ్డ ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక : ఆళ్లగడ్డ ప్రాజెక్టు నూతన కమిటీ అధ్యక్షులుగా సీత మహాలక్ష్మి,ప్రధాన కార్యదర్శిగా చంద్రకళ, కోశాధికారిగా తిరుపాలమ్మ, ఆఫీస్ బేరర్స్ గా బీబీ, ఇందుమతి, సుమల, రాజేశ్వరి, పద్మావతి, వహీదా సలహాదారులుగా వసుందర దేవి. గౌరవాధ్యక్షులుగా భాస్కర్ ను ఎన్నుకున్నారు.

జీవో నెంబర్ 79 ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - డోన్ : అనునిత్యం ప్రజల శ్రేయస్సు కోసం పనిచేసే పోలీసుల పాలిట శాపంగా మారిన జీవో నెంబర్ 79 ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్,ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి రాఘవేంద్ర,ఏఐవైఎఫ్ నాయకులు ఎల్లయ్య,శీనుఅన్నారు.గురువారం పట్టణంలో సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రణత్ యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సీఎం జగన్మోహన్ రెడ్డి జీవో నెంబర్ 79ను తీసుకొచ్చి ఏపీ పోలీసు అలవెన్స్‌లలో కోతలు విధించడం చాలా దుర్మార్గామన్నారు. పోలీసులు ప్రాణాలకు తెగించి శాంతిభద్రతలు కాపాడుతు రాత్రి పగలు అని తేడా లేకుండా 24గంటలు కుటుంబాలను వీడిప్రజల రక్షణ కోసం పనిచేస్తున్నారన్నారు.ప్రభుత్వాన్ని కాపాడుతున్నదికూడావారేఅని అన్నారు. పోలీసుల అలవెన్సుల్లో కోతలు దించడం సరైనది కాదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 79 ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ధర్నాను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బనగానపల్లి : వివిధ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో 12వ తేదీ 12 గంటలకు ధర్నాను విజయవంతం చేయాలని బనగానపల్లెఫ్యాప్టో కన్వీనర్ ఎం. మధుసూదన్ రావు పిలుపునిచ్చారు. స్థానిక ఏపిటిఎఫ్ కార్యాలయంలో ఏపిటిఎఫ్ మండల అధ్యక్షుడు జే.వెంకట కృష్ణుడు అధ్యక్షతన కన్వీనర్ సత్య ప్రకాష్ఫ్యాప్టోసంఘ సభ్యులతో సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో ఎం మధుసూదన్‌రావు మాట్లాడుతూ వైసీపీ సిపిఎస్ రద్దు తదితర డిమాండ్ల సమస్యల పరిష్కారం చేయడంలో విఫ్లవం కావడం వలన 12వ తేదీ ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్ఐ ఆకస్మిక బదిలీ

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు ఎస్ఐ జగన్‌మోహన్ ఆకస్మికంగా బదిలీ కావడం, నూతన ఎస్ఐగా వెంకట ప్రసాద్ బాధ్యతలు చేపట్టడం గురువారం జరిగింది. ఈ బదిలీ వెనుక అధికార పార్టీకి చెందిన ఒక రాజకీయ నేత హస్తం ఉందని పలువురు అంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా అధికార పార్టీ వారు కొందరిని నయానో, బయానో వైసీపీ పార్టీ లోకి పిలిపించుకోవటానికి ప్రయత్నించడం సర్వసాధారణం. .వైసీపీ పార్టీ లో ఉన్నా కొందరు నాయకులు అసంతృప్తితో దూరంగా ఉన్నారు.వారిని తిరిగి పార్టీలో చురుగ్గా పాల్గొనేలా, నయానో, బయానో ఒప్పించాలని చెపితే, ఒక మైనార్టీ నాయకుడు,నాయకుని మాట విననందున బదిలీ చేశారనే వాదన వెలుగోడు లో బలంగా వినిపిస్తోంది. ఏది ఏమైనా అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా లేకపోతే బదిలీ చేస్తారని, గతంలో జరిగిన కొన్ని సంఘటనలు రుజువు చేస్తున్నాయి.

పిల్లల ఆరోగ్యానికి భద్రత ఆల్బెండజోల్ మాత్రలు

విశాలాంధ్ర - రుద్రవరం : 1,19 వయసు కలిగిన పిల్లల ఆరోగ్యానికి భద్రత ఇచ్చేది ఆల్ బెండజోల్ మాత్రలేనని నరసాపురం, ఆలమూరు, రుద్రవరం వైద్యాధికారులు బాబు, అమర్నాథరెడ్డి ,శ్రావణి లు అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా కిశోర బాలికలకు అంగన్వాడి పిల్లలకు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ పిల్లలునులి పురుగుల బారిన పడటం వల్ల వారు శారీరకంగా మానసికంగా వారి ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అందువల్ల ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పనిసరిగా వేయించి వారు ఆరోగ్యంగా శక్తివంతంగా ఉల్లాసంగా ఉండేటట్లు చూడాలన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను వేయించుకొని వారికి తిరిగి ఈనెల 17వ తేదిన వేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు వేయించేందుకు ముందుకు రావాలని వారు తల్లిదండ్రులను కోరారు.పాఠశాలల సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది,అంగన్వాడి, ఆశ కార్యకర్తలు,పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : అన్ని రంగాలలో వెనుకబడ్డ పత్రా కులస్తులకు ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని నాయకులు కోరారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ సాయి సదన్ ఆడిటోరియంలో పత్ర కులజిల్లా స్థాయి ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు.పలువురు పత్రా నాయకులు మాట్లాడుతూ సామాజికంగా ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా పత్ర కులస్తులు వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఆదుకోవాలని అన్నారు. పత్రలందరూ ఐక్యంగా ఉండి అన్ని రంగాలలో రాణించాలన్నారు. తమ హక్కుల సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక: నాయకుల ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా పత్ర సంక్షేమ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా బెలుం పెద్దన్న,బి రాజయ్య, పి. కృష్ణుడు, జిల్లా అధ్యక్షునిగా ఉప్పలపాటి మల్లేశ్వరయ్య,ప్రధాన కార్యదర్శిగా జి.రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా పి వెంకట రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.పుల్లయ్య, కోశాధికారిగా కె.ఓబులేష్, సహాయ కార్యదర్శిగా ఏ సూర్యనారా యణ, స్టేట్ కమిటీ సభ్యులుగా బి బాల రంగయ్య, పి. మోహన్, పి.సుధాకర్, పి శ్రీనివాసులను ఎన్నుకున్నారు. ఆత్మీయ సమావేశానికి ఆయా జిల్లాల నుంచి పత్రా సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

మట్టి మిద్దె కూలి వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో బుధవారం రాత్రి నుండి తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి మట్టి మీద కూలిపోవడంతో గ్రామానికి చెందిన సావిత్రమ్మ అనే వృద్ధురాలు గురువారం మృతి చెందింది. రాత్రి ఇంటిలో నిద్రస్తుండగా పైకప్పు కూలి సామిత్రమ్మ మీద పడడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయింది. స్థానికులు గమనించి ఆమెను కాపాడు ప్రయత్నం చేయగా అప్పటికే సావిత్రమ్మ మృతి చెందినట్లు స్థానికులు, కుటుంబీకులు తెలిపారు. సంఘటన స్థలాన్ని నందికొట్కూరు తాసిల్దార్ రాజశేఖర్ బాబు తన రెవిన్యూ సిబ్బందితో పరిశీలించారు.మృతురాలికి సంబంధించిన సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు రవీందర్ నాయుడు, శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 11, ఆగస్టు 2023

వేదవతి ప్రాజెక్టు 8టీఎంసీల నీరు కేటాయించాలి

విశాలాంధ్ర - హొళగుంద : వేదవతి ప్రాజెక్ట్‌కు 8 టీఎంసీల నీరు కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రెండవ రోజులు దీక్షలు కొనసాగించారు. ఈ దీక్షలకు టీడీపీ, ఆర్‌సీసీసీ, ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం మండల జిల్లా నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి మారెప్ప, టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య. ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఏపీ వి బి ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ మాట్లాడుతూ వేదవతి ప్రాజెక్టు 8 టీఎంసీల నీటి సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించాలని ,భూములు కోల్పోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం మెరుగైన నష్టపరిహారం ఇవ్వాలని, నిలిచిపోయిన పనులను పునః ప్రారంభించాలని, ఆలూరు నియోజక వర్గంలో 253 గ్రామాలకు సాగునీరు త్రాగునీరు ఇవ్వాలని ,ప్రాజెక్ట్ పరిధిలోకి ఆస్పరి మండలాన్ని చేర్చాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వేదవతి ప్రాజెక్ట్ పనులను వెంటనే పనులను పునః ప్రారంభించక పోతే రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన ప్రజాసంఘాలు ,వామపక్షాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రంగన్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యుడు శ్రీరంగ ,రైతు సంఘం నాయకులు కృష్ణ ,మౌలా సాబ్ ,ఏపీ వి బి ఎస్ మండల అధ్యక్షుడు దిడ్డి తిక్క స్వామి, టీడీపీ,ఆర్‌సిసి,ఏపివిబిఎస్ నాయకులు దిడ్డి సిద్దా ,మల్లయ్య ,శ్రీను, మంజునాథ్ గౌడ్ ,శివ ,శీను, కార్తీక్,సిపిఐ,ఏఐటీయూసీ నాయకులు నూర్ భాషా,అబ్దుల్లా సలాం సబ్, ఇనాహిత్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర – పత్తికొండ : పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న పాఠశాలల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి నజీర్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి అధికారి అరుణ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం పత్తికొండలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెంకులబడి, సెయింట్ జోసెఫ్ పాఠశాలల దగ్గర ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించడం జరిగిందని, అయితే ఇంతవరకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవ దంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి తక్షణమే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ, పవన్, రమేష్, రాజు, మహేష్, సోము తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ దీక్షలకు టీడీపీ,సిపిఎం మద్దతు

విశాలాంధ్ర - ఆస్పరి : నియోజకవర్గ పరిధిలోని గూళ్యం దగ్గర హగిరిపై వేదావతి ప్రాజెక్టును ఎనిమిది టిఎంసిల సామర్థ్యంతో నిర్మించాలని, పెండింగ్ పనులను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో 2వ రోజు చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలకు గురువారం టీడీపీ నాయకులు సొసైటీ మాజీ చైర్మన్ నౌనేపాటి చౌదరి, మాజీ మండల కన్వీనర్ శ్రీనివాసులు గౌడ్, సీపీఎం మండల నాయకులు బాలకృష్ణ, రంగ స్వామి, రామాంజనేయులు, మధుసూదన్ రెడ్డి, వెంకట రాముడులు దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి మాట్లాడుతూ వేదావతి ప్రాజెక్టు పరిధిలోకి ఆస్పరి మండలాన్ని చేర్చాలని, హంద్రీనీవా ఎడమ కాలువ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు తాగు, సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సాయంత్రం డిప్యూటీ తహశీల్దార్ గాయత్రి, వీఆర్వో హరి నాయక్‌లు దీక్షా శిబిరాన్ని సందర్శించి దీక్షలో కూర్చు న్న నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళుతున్నట్లు ఆమె తెలిపారు.దీక్షలలో ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షులు అంజినయ్య, సీపీఐ నాయకులు బడే సాబు, రంగన్న, రామాం జనేయులు, ఏఐవైఎఫ్ నాయకులు బాలు, వెంకటేష్ లు దీక్షలో కూర్చున్నారు.సీపీఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి ఉరుకుందప్ప,హమాలిసంఘం అధ్యక్షులు హనుమంతు, రామాంజని, హనుమంతు, నాగేష్, ఆంజనేయ, రంగప్పలు పాల్గొన్నారు.

సరికొత్త సీరియల్ నిండు నూరేళ్ల సావాసం

విశాలాంధ్ర - కర్నూల్ : తెలుగు ప్రేక్షకులకు వినోదం పంచడంలో తిరుగులేని ఛానల్ జీ తెలుగు. ఊహించని మలుపులు, ఆసక్తికర కథనాలతో సాగే సీరియల్స్ తో ఆకట్టుకుంటున్న జీ తెలుగు మరో సరికొత్త సీరియల్తో మీ ముందుకు రాబోతోంది. ప్రేక్షకులకు అసలైన వినోదాన్ని అందించడంలో ముందుండే జీ తెలుగు సరికొత్త కథనాలు, ఆలోచింపజేసే ఇతివృత్తాలతో ఆసక్తికర మలుపులతో సాగే సీరియల్ని అందిస్తూ అలరిస్తోంది. వినోదాన్ని రెట్టింపు చేసేందుకు మరో ఆసక్తికరమైన కథతో సాగే సీరియల్తో మీ ముందుకు రానుంది. ఓ సైనికుడి జీవితంలో ఊహించని మలుపులతో సాగే కథ నిండు నూరేళ్ల సావాసం' సోమవారం నుంచి శని వారం వరకు ప్రతిరోజు రాత్రి 7 గంటలకు మీ జీ తెలుగులో రానుంది.

కిమ్స్‌లో ఆరోగ్యశ్రీ, హెల్త్‌స్కీమ్ సౌకర్యం

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : కిమ్స్ హాస్పిటల్ కర్నూలు ప్రైవేట్ లిమిటెడ్‌లో అత్యాధునికమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నట్లు హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రీయింబర్స్మెంట్ మరియు ఇన్సూరెన్స్ సౌకర్యం కలదని, అసక్తి గల వారు కిమ్స్ హాస్పిటల్ కర్నూలు సంప్రదించాలని ఆయన కోరారు.

పోటాపోటీగా వార్డు మెంబర్ నామినేషన్లు దాఖలు

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని చిన్న హై ట తొమ్మిదో వార్డ్ మెంబర్ స్థానానికి గురువారం రెండు నామినేషన్ దాఖలు అయ్యాయని ఎండిఓఈ రాధ తెలిపారు. అలాగే సులువాయిల్లో వార్డ్ మెంబర్‌ఉప ఎన్నిక స్థానానికి నాలుగు నామినేషన్లు మద్ది లింగదహళ్లి లోని వార్డ్ మెంబర్ ఉపఎన్నిక స్థానానికి నాలుగు నామినేషన్లు దాకలయ్యాయని అన్నారు. వార్డ్ మెంబర్ల ఉప ఎన్నికల స్థానానికి అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లను దాఖలు చేశారు. ఎన్నికల అధికారులు నామినేషన్ పత్రాలను స్వీకరించారు ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పెద్దకడబూరు : మెంబర్ల ఎన్నికకు గురువారం మొత్తం ఎనిమిది నామినేషన్లు దాఖలు అయ్యాయి. గంగులపాడు గ్రామంలో 5వ వార్డుకు వైసీపీ తరుపున ముంతాజ్, ఉప్పర లక్ష్మీ నామి నేషన్ పత్రాలను వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు యంకప్పస్వామి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి మల్లయ్యకు అందజేశారు. అలాగే టీడీపీ బలపరుస్తున్న లక్ష్మీ, మరొకరు నామినేషన్ పత్రాలను టీడీపీ లీగల్ సెల్ తాలూకా అధ్యక్షులు బాబురావు, నాయకులు రాఘవేంద్రస్వామి, హనుమేష్ స్వామి,సోమన్నల ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి మల్లయ్యకు అందజేశారు. కల్లుకుంట గ్రామంలో 11వ వార్డుకు వైసీపీ తరుపున సుజాత, మాలలక్ష్మీ వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఇర్ఫాన్ దేశాయ్, నాయకులు సత్యగౌడ్, విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ బలపరుస్తున్న మాణిక్యమ్మ టీడీపీ నాయకులు దాసప్ప రెడ్డి, సర్దార్ బాషా, నాగప్ప, తాయన్నల ఆధ్వర్యంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి వరప్రసాద్ అందజేశారు. సీపీఎం తరుపున రాణెమ్మ సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల తరఫున పోటాపోటీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి.

తాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయడంలో విఫలం

విశాలాంధ్ర - గోనెగండ్ల : దశాబ్దాకారంగా పెండింగ్‌లో ఉన్న రాజోలి బండ డైవర్షన్స్ స్కీమ్ కుడి కాలువ నిర్మాణాన్ని పూర్తిచేసి 40,000 ఎకరాలకు సాగునీరు అందించి మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలలో వలసలు నివారించాలని కోరుతూ గోనెగండ్ల సిపిఐ మృతి ఆధ్వర్యంలో గురువారం రోజున తాహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ఈ ధర్నా కార్యక్రమం ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన గౌడ్,జి.రంగన్న,సిపిఐ మండల కార్యదర్శి కె.నాగప్ప పాల్గొని మాట్లాడుతూ మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలు అత్యంత వెనుకబడిన నియోజకవర్గాలని,ఆ నియోజకవర్గాలలో నిత్యం కరువు,వలసలు తాండవం చేస్తున్నాయని, కరువు కాటకాలకు నిలయంగా ఉన్న మంత్రాలయం నియోజవర్గంలో 4టిఎమ్‌సీల ఉపయోగం గల ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణంపూర్తిచేస్తేమంత్రాలయం,ఎమ్మిగనూర్,కోడుమూరు నియోజక వర్గాలకు సంబంధించి 40,000ఎకరాలకు సాగునీరు వంద లాది గ్రామాలకు తాగునీరు అందించే ఆర్డీఎస్ అని వారు తెలిపారు. గత తెలుగుదేశ ప్రభుత్వంలో ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1985.42 కోట్ల రూపాయలతో అంచన వ్యయంతో నాగార్జున కన్స్ట్రక్షన్స్ పనిచేయడానికి టెండర్ తీసుకోవడం జరిగిందని, కుడి కాలువ నిర్మాణాన్నికి సుమారు 13 కోట్లతో పనులు చేయడం జరిగిందని,ఆ పనులకు వైసీపీ ప్రభుత్వం పైసా కూడా చెల్లించలేదని దీంతో వారు పనులు నిలుపుదల చేసి అర్ధాంతరంగా వెళ్లిపోవడం జరిగిందని వారు తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం మెరుగైన నష్టపరియాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని,భూసేకరణ ప్రాజెక్టు నిర్మాణం కొరకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయకపోవడం దారుణమని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తాహశీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. సిపిఐ మండ ల సహాయ కార్యదర్శి మునుస్వామి, సిపిఐ నాయకులు జయరాం, సుధాకర్, రంగన్న,దస్తగిరి, మనోహర్,రాఘవ ఇలియాజ్,జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతనం పెంచాలి

విశాలాంధ్ర - కౌతాళం : ప్రతి ఉపాధి కూలీకి ఒక రోజుకి 600 రూపాయలు కూలీని ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం తరపున డిమాండ్ చేశారు కౌతాళంలో వ్యవసాయ కార్మిక సంఘం విస్తృత సమావేశం మండల కార్యదర్శి ఈరన్న అధ్యక్షతన ఏర్పాటు చేయడమైనది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నబి రసూల్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ఉపాధి కూలీల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్‌ఆర్జిఎస్ నిధులని సచివాలయాలకు, ఇతరత్రా కార్యక్రమాలకు వైయస్సార్ ప్రభుత్వం వృధాగా ఖర్చు చేస్తుందని ఉపాధి కూలీలకు రావలసిన కూలీలను డబ్బును సైతం ప్రభుత్వ . ఆర్భాటాలకు వాడుకుంటున్నట్లు వారు తెలిపారు ఈ పద్ధతి మానుకొని కూలీలను ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ , పెద్ద కడుపూరు మండలం వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కే చంద్ర, కోస్గి మండల కార్యదర్శి గోపాల్, మంత్రాలయం కార్యదర్శి లక్ష్మణ నాయక్ పాల్గొన్నారు. నూతన కమిటీ ఎన్నిక:- కౌతాళం మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్, శివ. కోస్గి మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, రాజు పెద్దకడబూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు సి నగేష్,సి శివ మంత్రాలయం మండల అధ్యక్ష కార్యదర్శులు పి నబి రసూల్, వీరిని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా దాసరి నాగభూషణరావు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి దాసరి నాగభూషణ రావు 97వ జయంతి వేడుకలు గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ పట్టణ, మండల కార్యదర్శిలు సుదర్శన్,కల్లుబావి రాజు ఆధ్వర్యంలో నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.అజయ్ బాబు మాట్లాడుతూ 1925వ సంవత్సరంలో నూజివీడు తాలూకా,దిగపల్లి గ్రామంలో జన్మించాడని, అతను విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నిరుపేదల పక్షాన నిలిచి భూ పోరాటాల ద్వారా విజయం సాధించిన గొప్ప విప్లవయోధుడని కొనియాడారు. సీపీఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా 1992-97వరకు పేద ప్రజల పక్షాన నిలబడి హక్కుల సాధన కోసం పోరాటాలు కొనసాగించా రన్నారు. 1998 సంవత్స రంలో రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై, సీపీఐ జాతీయ కార్యదర్శి సభ్యునిగా పార్టీకి సేవలు చేశారని చర్లపల్లి జమిందార్ భూములను పేదలకు పంచాలని చేసిన భూ పోరాటంలో దాసరి నాగభూషణరావు కూడా అగ్ర భాగాన నిలిచాడన్నారు. ఆనాటి అధిష్ఠానం రాజ్యసభ సభ్యునిగా ఉన్న కాలంలో అన్ని ప్రాంతాలకు ప్రభుత్వ నిధులు కేటాయించి దళితుల వాడలలో నిరుపేదలకు నివాసాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తనంతగా కృషి చేశారన్నారు.గ్రంథాలయాలు పాఠశాలల భవనా లు వేయించారని, రాష్ట్రంలో ఎంపీ నిధులను పేదల అవసరాలకు వినియోగించిన విషయం మరొకసారి గుర్తు చేసుకున్నారు.దాసరి నాగభూషణరావు సేవలను గుర్తించుకొని నిత్యం ప్రజలు ఎదుర్కొంటు న్నటువంటి సమస్యల పరిష్కారం కొరకు ప్రత్యేక పోరాటాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. సీపీఐ పట్టణ సహాయకార్యదర్శివిజయ్, లక్ష్మీనారాయణ,కుమారస్వామి,పుష్పరాజు,మహేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసిన పట్టించుకోరా...?

విశాలాంధ్ర - దేవనకొండ : నిత్యం గ్రామాలకు వెళ్ళే వాహనాలు రోడ్డు చివరికోస్తే ప్రమాదమే అయిన పట్టించుకునే వారేరి స్థానిక ఎర్ర చెరువు వద్ద రోడ్డు పక్కనే మట్టి మొత్తం చెరువులోకి వెళ్ళడంతో పెద్ద గొయ్యిలా మారి ప్రమాదకరంగా ఉంది.రోడ్డుపై వెళ్ళే వాహనదారులు తెలియకుండా తారు రోడ్డు దిగితే నేరుగా చెరువులోకి వెళ్ళడమేలా అన్నట్లుగా ప్రమాదం పొంచి ఉంది.రోడ్డుకిరువైపుల వాహనాలు వస్తే అదమరిచి కిందకి దిగితే అంతే సంగతిలా ఉన్న సమస్యను సంబందింత ఇరిగేషన్,ఆర్‌అండ్‌బి అధికారులలేకస్థానికప్రజాప్రతినిధులుపరిష్కరించకపోతేపెను ప్రమాదమే.

నిధులు మంజూరు చేస్తాం

విశాలాంధ్ర - ఆదోని : నిధులు మంజూరు చేస్తాం, క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, పనులు పూర్తి చేయడంలో అధికారులు శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అధ్యక్షతన ఆదోని, ఆలూరు నియోజకవర్గాలకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల అమలుపై జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులతో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి గుమ్మనూరు జయరాం,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని మున్సిపల్ చైర్మన్ శాంత, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గాల వారీగా సమీక్షా సమా వేశాలు నిర్వహించుకుంటున్నామన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి చర్చించి పరిష్కరించుకోవాలన్నది ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.మౌలిక వసతులకు సంబంధించి రోడ్లు, తాగు నీరు తదితర సమస్యలకు సంబంధించి 90శాతం పూర్తి అయి, 10శాతం పనులు నిలిచి పోయిన వాటిని వాటిని వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక పని మొదలు పెట్టినప్పటి నుంచి ఆ పని పూర్తయి, నిర్వహణ లో బాగుంది అనేంత వరకు అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు.. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులపై ప్రజలకు చాలా అంచనాలు ఉంటాయని, ప్రజల అంచనాలకు తగినట్లు పని చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందని, ఇందుకు ప్రభుత్వ ఉద్యోగుల సహకారం ఎంతైనా అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. కోవిడ్ వల్ల వచ్చిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూనే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టామని మంత్రి పేర్కొన్నారు. ఇచ్చిన మాట తప్పకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తున్నారన్నారు. ఇప్పటికే అభివృద్ధి పనులకు సంబంధించి ఎన్‌ఆర్‌ఈజీఎస్, ప్రయారిటీ బిల్డింగ్స్, ఎక్స్టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుకు సంబంధించిన బిల్లులను చాలా వరకు చెల్లించామని, మిగిలిన బిల్లులను కూడా త్వరలో చెల్లిస్తామని, కాంట్రాక్టర్లతో పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ అంశంలో తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తా మని మంత్రి స్పష్టం చేశారు. ఆలూరు మార్కెట్ అభివృద్ధి, దేవనకొండ మండలం కొత్తపేట నుండి తెర్నేకళ్ రోడ్డు పై వంతెన నిర్మాణం,ఆస్పరి మండలం బనవనూరు నుండి పొట్లపాడు వంతెన నిర్మాణా లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రోడ్లు,భవనాల శాఖ ద్వారా ధనాపురం నుండి హొలగుంద రోడ్డు పనిని పూర్తి చేయాలని, ఆదోని - సిరుగుప్ప రోడ్డు నుండి గజ్జెహళ్లి, ఆలూరు టౌన్ లో బళ్ళారి - కర్నూల్ రోడ్డు, హొలగుంద బస్టాండ్ నుండి వాల్మీకి సర్కిల్ వరకు, ఆలూరు గెస్ట్ హౌస్,ఆలూర్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆలూరు లోని 30 పడకల ఆసుపత్రి ని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, డిజిఓ,జనరల్ సర్జన్ పోస్ట్ లను భర్తీ చేయాలని, హొలగుంద మండలంలో మార్లమడకను ఇసుక రీచ్ గా గుర్తించాలని, హాలహర్వి నందు లైబ్రరీ భవనం, జూనియర్ కాలేజ్ కొరకు ప్రతిపాదనలు పంపాలని, బాపురంలో క్రొత్త అంగన్ వాడి సెంటర్, దేవనకొండ మండలం నందు మోడల్ స్కూల్, డిఎన్టి హాస్టల్ మరల తిరిగి ప్రారంభించి కొత్త భవనానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఆలూరు, దేవనకొండలో కొత్త తహసిల్దార్ ఆఫీస్ భవనాలు, సబ్ ట్రెజరీ కార్యాలయ భవనం, హై స్కూల్ లో ఆట స్థలం, బిసి బాలికల వసతి గృహం, దేవనకొండ సంత మార్కెట్ కు ప్రహరీ గోడ నిర్మాణం, దేవనకొండ మండలం వరిముక్కల గ్రామంలో స్మశానం కొరకు స్థలము మంజూరు, ఆలూరు లో జింకల పార్క్ ఏర్పాటు, కొరకు చర్యలు, హెచ్ ఎన్ ఎస్ ఎస్ పిల్ల కాలువల కొరకు ప్రతిపాదించిన అంచనాలు 168 కోట్లు మంజూరు చేసి, మిగిలిన ఆయకట్టు 31 వేల 802 ఎకరాలకు నీరు ఇప్పించుట, జొ హరాపురం గ్రామములో ట్యాంక్ నిర్మాణం,ఆలూరు దిన్నె వాగు నుండి ఆస్పరి మండల రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా నీటిని అందించాలని, వేదవతి ప్రాజెక్టు పనుల గురించి మంత్రి ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తెచ్చారు.

ఆదోని నియోజకవర్గం పై సమీక్ష

ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఆదోని నియోజకవర్గం లో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు.ధనాపురం రోడ్డు గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్లో ఉందని, మున్సిపల్ కింద చేపడుతున్న రోడ్ల మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని, బైపాస్ రోడ్డు - సిరుగుప్ప - సంతేకుడ్లూర్, సిరిగుప్ప- పెద్ద హరివాణం రోడ్లను నిర్మాణం చేయాలని కోరారు. జలజీవన్ మిషన్ కింద పనులు పెండింగ్ ఉన్నాయని, గ్రామాల వారీగా టెండర్లు పిలిచి మండలం లోని అన్ని గ్రామాలకు తాగునీరు ఇప్పించాలని కోరారు. చిన్న హరివాణం, సంతేకుడ్లూర్, పెద్ద తుంబలం ఫిల్టర్ బెడ్లను మార్పుకు నిధులు మంజూరు చేయాలని కోరారు.. ఆదోని మండలంలోని 20 గ్రామాల్లో కమ్యూనిటీ లెట్రిన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.జిల్లా కలెక్టర్ డా.జి.సృజన మాట్లాడుతూ సమావేశంలో ప్రజాప్రతినిధులను లేవనెత్తిన అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలను పంపుతామన్నారు.ప్రతివారం ఈ అంశాలపై సమీక్షించి, ప్రతిపాదించిన పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

సర్పంచుల గోడు అధికారులకు పట్టదా..?

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : మంచి విద్య ఉన్న,ఎక్కడైనా ప్రైవేట్ రంగాలలో పనిచేస్తే వేలకు వేలు వేతనాలు పొందుతామని తెలిసినా ప్రజాసేవ చేయాలనే లక్ష్యంతో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన అభివృద్ధికి మాత్రం కొన్ని ఆటంకాలే ఎదురవుతున్నాయి. మండలంలోని బల్లెకల్ గ్రామంలో వీధిలైట్లకు తదితర విద్యుత్ అవసరాల మరమ్మతులు చేపట్టేందుకు లైన్మెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని, ప్రజలు గోడు వినిపిస్తున్నారు.ఇక్కడ అసలు విషయం ఏమిటంటే అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని లైన్మెన్ గా ప్రభుత్వ అధికారులు నియమించడంతో సర్పంచ్ కోరుతున్న పనులు చేపట్టక మాట దాటవేస్తున్నాడని గ్రామ సర్పంచు లోకేష్ అన్నారు.ప్రజలు నేరుగా ఆ లైన్మెన్ కి వీధిలైట్లు పడడం లేదు మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు కోరితే, నన్ను ఎందుకు అడుగుతారు మీ సర్పంచ్ ని అడగండి అని ఉచిత సమాధానమిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్పంచు లోకేష్ సంబంధిత లైన్మెన్ పై బదిలీ చేసి కొత్త లైన్‌ను నియమించాలని ట్రాన్స్కో ఎఇ చెన్నయ్యను కోరగా,ఆ లైన్మెన్‌తో నేను మాట్లాడుతాను అని మాట దాటవేసి పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నాడని సర్పంచు లోకేష్ గోడు విన్నవించుకున్నాడు రాబోయే ఎన్నికల్లో వైసిపి పార్టీకి ఓట్లు మెజార్టీ తగ్గే ప్రసక్తి కనిపిస్తుందని ఆ గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ లైన్మెన్ మర మ్మతులు చేయకపోతే, ప్రైవేట్ ఎలక్ట్రిషన్ వ్యక్తులతో అధిక వేతనాన్ని వెచ్చించి మరమ్మతులు చేపడుతున్నట్లు సర్పంచ్ చెప్పుకొచ్చారు. రాష్ట్రం ఆర్థిక స్థితిగతులతో నలిగిపోతున్నందున చేసిన వర్కులకు నిర్ణీత సమయంలో బిల్లులో జమ కాక ఇబ్బంది పడుతున్నామని చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ రూరల్ ఏఈ చిన్నయ్య చొరవ చూపి వేరే లైన్మెన్ ను బదిలీలో నియమించాలని కోరారు. సమస్యను పరిష్కరించలేని పక్షంలోఎంతటిదాకైనాగ్రామస్తులనుకలుపుకొనిపోరాటాలు చేస్తామన్నారు.

ఆర్‌డిటి సంస్థకు ఎమ్మెల్యే విరాళం

విశాలాంధ్ర-కోసిగి : మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆర్డీటి సంస్థ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని, ఆర్డీటి సంస్థ చేపడుతున్న భారతీయుల కోసం భారతీయులు కార్యక్రమం కోసం రెండు లక్షల రూపాయల నగదును విరాళంగా ఆర్డీటి సంస్థకు గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో అందజేశారు. మాట్లాడుతూ కౌతాళం, కోసిగి, మంత్రాలయం మండలాల్లో ఉన్న పేద ప్రజలకు సేవ చేస్తున్నటువంటి సంస్థను కొనియాడారు. వారి యొక్క సేవలను గుర్తు చేశారు. ముఖ్యం గా చదువు పట్ల చేస్తున్న సేవ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు లేని అనాథ మరియు పేద విద్యార్థులకు చదివిస్తున్న విధానానికి ఆకర్షితులై విరాళం చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ నగదును సంస్థ సిబ్బంది అయినా రీజి నల్ డైరెక్టర్ రామేశ్వరి, ఏటీఎల్ కృష్ణయ్యలకు అందజేశారు. సంస్థ కోసం ఏవైనా సహాయాలు చేయాలంటే అన్ని విధాల మేము ముందు ఉండి సహ కారాలు చేస్తామన్నారు. జంపాపురం సర్పంచ్ హారోన్,బసిరెడ్డి, రంగారెడ్డి, చిన్న బసిరెడ్డి, దొడ్డి.నరసన్న, సంస్థ సిబ్బంది బసవరాజు పాల్గొన్నారు.

నైతిక విలువలే ప్రాతిపదికగా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వాస్తవికతకు అద్దం పట్టే విధంగా వార్తలను ప్రచురిస్తూ మెరుగైన సమాజం కోసం 7 దశాబ్దాలుగా కృషి చేస్తున్న విశాలాంధ్ర జాతీయ దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

శ్రీ దిడ్డి చిన్న మల్లయ్య
2వ వార్డు మెంబర్, హొళగుంద

శ్రీ బకాడి వీరేష్
మీసేవ నిర్వాహకులు, హొళగుంద

నైతిక విలువలే ప్రాతిపదికగా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వాస్తవికతకు అద్దం పట్టే విధంగా వార్తలను ప్రచురిస్తూ మెరుగైన సమాజం కోసం 7 దశాబ్దాలుగా కృషి చేస్తున్న విశాలాంధ్ర జాతీయ దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

విశాలాంధ్ర జాతీయ దినపత్రికకు 71వ వార్షికోత్సవ శుభాకాంక్షలు



శ్రీ బి.మల్లికార్జున
శ్రీ ఎల్లార్తి హజరత్ షేక్షావలి శేషావలి
దర్గా మాజీ నిర్వాహకుడు, ఎల్లార్తి